

అబుల్ కలాం జయంతి 2




పీడీఎస్ బియ్యం దందా.. 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

11-11-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్‌లు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తెలిపారు. జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారం కోసం అధికారులకు నివేదించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## జలాశయాలకు వరద తగ్గుముఖం

**అక్షరటుడే, మెండోరా/ఎల్లారెడ్డి:** ఉమ్మడి జిల్లాలోని ప్రధాన జలాశయాలకు వరద తగ్గింది. దీంతో శ్రీరాంసాగర్, నిజాంసాగర్‌లలో నీటిమట్టం నిలకడగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం అంతే మొత్తంలో నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 9,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు కాల్వల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఎస్కేప్ గేట్ల ద్వారా 8,000 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు. కాకతీయ కాలువ, లక్ష్మా కాల్వలకు నీటిని విడుదల చేయడం లేదు. అలాగే 573 క్యూసెక్కుల నీరు ఆవిరిగా పోతోంది.

### నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్‌కు వరద తగ్గుముఖం పట్టింది. దీంతో ఒక గేట్ ద్వారా 2,498 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా.. అంతే మొత్తంలో నీరు నిల్వ ఉంది.



## ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలి : కలెక్టర్

**అక్షరటుడే, కామారెడ్డి:** ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి, తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామాల్లో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. తేమశాతం, తూకం విధానం, ధాన్యం నిల్వల సదుపాయంపై రైతులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కజొన్న పంట ద్వారా వచ్చే ఆదాయం వివరాలను రైతుల ద్వారా ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 427 వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1,23,993 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇందులో 59,162 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 64,831 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని 11,196 మంది రైతుల నుంచి సేకరించామన్నారు. రూ.145 కోట్లు రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని చెప్పారు. 18 మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయగా 13 కేంద్రాలను ప్రారంభించినట్లు వివరించారు. వీటి ద్వారా 2149.5 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, ట్రెయినీ కలెక్టర్ రవితేజ, డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్, డీసీవో రామ్మోహన్ ఉన్నారు.





## నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ఢిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో దేశం మొత్తం కేంద్ర హోంశాఖ హైఅలర్ట్ విధించింది. ఈ మేరకు జనసమ్మర్ధమైన ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టారు. జిల్లాలో పోలీసులు అలర్ట్ అయ్యారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. సికింద్రాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఎస్‌హెచ్‌వో సాయరెడ్డి ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌లో మంగళవారం తనిఖీలు చేశారు. స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలతో పాటు, పార్సల్ సెక్షన్, అనుమానాస్పద బ్యాగులను తనిఖీ చేశారు.

మందు తాగి వాహనం నడిపిస్తున్నారా..? తస్మాత్ జాగ్రత్త... డ్రంకన్ డ్రైవ్‌లో పొరపాటున పోలీసులకు చిక్కితే రూ.పదివేలు సమర్పించుకోవాల్సిందే.. అంతే కాకుండా జైలుకు పంపే అవకాశాలు కూడా ఉన్నాయి. అదనంగా డ్రైవింగ్ లైసెన్స్ రద్దయ్యే ఛాన్స్ కూడా ఉంటుంది. మందుబాబులు రోడ్లపైకి రాకుండా కట్టడి చేసేందుకు ప్రభుత్వం తెచ్చిన మోటార్ వెహికిల్ సవరణ చట్టం అమలులోకి వచ్చింది. దీంతో డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు.

- అక్షరటుడే, నిజామాబాద్ సిటీ




# పట్టుబడితే రూ.పదివేలు

- డ్రంకన్ డ్రైవ్‌లో దొరికితే భారీగా జరిమానా
- అమల్లోకి మోటార్ వెహికిల్ సవరణ చట్టం
- పక్కాగా అమలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రోడ్డు ప్రమాదాలపై ప్రభుత్వం కొన్నేళ్లుగా ప్రత్యేక బృందం అధ్యయనం చేసింది. అయితే ఎక్కువ ప్రమాదాలు డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయని గుర్తించింది. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం కొత్తచట్టాన్ని అమల్లోకి తెచ్చింది. సవరించిన మోటార్ వాహనాల సవరణ చట్టం-2019 ప్రకారం ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపినట్లయితే అత్యధికంగా జరిమానాలతో పాటు ఒకరోజు నుంచి వారం రోజులపాటు న్యాయస్థానం జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది.

### నేటి నుంచే అమల్లోకి సవరణ చట్టం..

కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని మంగళవారం నుంచి అమల్లోకి తీసుకువచ్చింది. ఈ కొత్తచట్టంలో దేశవ్యాప్తంగా ఎక్కడ కూడా మద్యం సేవించి వాహనం నడపరాదు. నడిపి పోలీసులకు దొరికితే రూ.10వేల జరిమానాతో పాటు వారం రోజుల వరకు జైలుశిక్ష విధించవచ్చు.

### సవరణ చట్టం ఎందుకంటే..

గతంలో ఉన్న 1988 మోటార్ వెహికల్ చట్టం ప్రకారం ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపినట్లయితే రూ.2,000 జరిమానాతో పాటు జైలుశిక్ష విధించేవారు. రెండోసారి కూడా మద్యం తాగి పోలీసులకు చిక్కినట్లయితే కోర్టు రూ.3,000తో పాటు ఒకరోజు నుంచి ఆర్నెళ్ల పాటు జైలుశిక్ష వేసేది. అయినప్పటికీ మందుబాబుల్లో ఎలాంటి మార్పు రాలేదు. పైగా కేసులు మరిన్ని పెరిగాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని సవరించి మొదటిసారి మద్యం సేవించి వాహనం నడిపిన వారికి రూ.10,000 జరిమానాతో పాటు జైలుశిక్ష .. రెండోసారి పట్టుబడితే రూ.15వేలతో పాటు ఒకరోజు నుంచి ఆర్నెళ్ల జైలుశిక్ష విధించేలా చట్టాన్ని మార్చింది. దేశవ్యాప్తంగా ఈ చట్టం అమలులోకి వచ్చింది.

### 28 మందికి రూ.పది వేల చొప్పున ఫైన్..

డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన పలువురికి కొత్త మోటార్ సవరణ చట్టం ఆధారంగా కోర్టు మంగళవారం జరిమానాలు విధించింది. రూ. పదివేల జరిమానాతో పాటు పలువురికి జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేయగా సుమారు 34 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చారు. విచారించిన న్యాయమూర్తి 28 మందికి రూ.2,69,000 జరిమానా విధించారు. అలాగే ఆరుగురికి రెండు, మూడు రోజుల చొప్పున జైలుశిక్ష విధించారు.

### “ మద్యం తాగి వాహనాలు నడపొద్దు



దేశవ్యాప్తంగా కొత్త వాహనాల చట్టం అమలులోకి వచ్చింది. ఒకవేళ మద్యం సేవించినట్లయితే వాహనాలు నడపవద్దు. మీ స్నేహితులు లేదా బంధువుల సాయంతో ఇంటికి వెళ్లాలి. అంతేకాని సొంతంగా వాహనాలు నడిపించకూడదు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలి. లేకపోతే మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. మద్యం తాగి పట్టుబడితే వారిని 24 గంటల్లోగా కోర్టు ముందు హాజరుపర్చుతాం. జరిమానాల అమలు మంగళవారం నుంచి ప్రారంభమైంది.

– ప్రసాద్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, నిజామాబాద్

## భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్

**అక్షరటుడే, బోధన్:** భూభారతి పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఎడపల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. తహశీల్దార్, ఇతర సిబ్బందితో భూభారతి, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక అమలుపై సమీక్షించారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల్లో ఆయా మాడ్యుల్స్‌లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు.. ఎన్ని నోటీసులు ఇచ్చారనే విషయంపై అధికారుల ద్వారా వివరాలు సేకరించారు. నిర్ణీత గడువులోపు అన్ని దరఖాస్తులు పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. దరఖాస్తులు తిరస్కరణకు గురయితే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయా కేటగిరీల వారీగా మ్యాపింగ్ నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ దత్తాద్రి ఉన్నారు. బోధన్ మండలం చిన్నమావందిలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అదనపు కలెక్టర్



కిరణ్ కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. సోయాబీన్ పంట నాణ్యత, తేమ శాతంను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల సోయాబీన్ సేకరణ జరిపారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద యంత్రం సాయంతో పంటను శుభ్రం చేస్తున్న తీరును గమనించి, అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేష్, వ్యవసాయ అధికారి సంతోష్, స్థానిక అధికారులు ఉన్నారు.



## సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కాంగ్రెస్ కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు సుంకెట రవి ఆధ్వర్యంలో పలువురు మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్షల టైంటేబుల్ విడుదల

**అక్షరటుడే, ఇందల్వాయి:** తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ పరీక్షలకు సంబంధించిన టైంటేబుల్‌ను పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య సంపత్ కుమార్ మంగళవారం విడుదల చేశారు. డిగ్రీ సీబీసీఎస్ ఒకటో, మూడో, ఐదో, సెమిస్టర్ రెగ్యులర్, రెండవ, నాల్గో, ఆరవ, సెమిస్టర్ (బ్యాక్‌లాగ్స్) పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 2021 నుంచి 2025 వరకు బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు థియరీ పరీక్షలు నవంబర్ 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఆయన తెలిపారు.

## కళాశాలను సందర్శించిన ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రెటరీ

**అక్షరటుడే, బాన్సువాడ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ పద్మ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల రికార్డులు, పాఠశాల వసతులను సమీక్షించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసద్ ఫారుఖ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.




## హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** హైకోర్టు తీర్పును అమలు చేయాలని ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు వర్సిటీలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ తెలంగాణ యూనివర్సిటీ మాజీ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం, పీడీఎస్‌యూ నాయకులు అనిల్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీలో నియామకాలు చట్టవిరుద్ధంగా జరిగాయని హైకోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. వారి తొలగించాలని తీర్పు వెల్లడించిందన్నారు. ఆ తీర్పును అమలు చేయకుండా యూనివర్సిటీ అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, గోవింద్, మహేష్, అరుణ, పవిత్ర, సంధ్య, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## ‘బీసీలు రాజకీయంగా ఎదగడం పార్టీలకు ఇష్టం లేదు’

**అక్షరటుడే, కామారెడ్డి :** బీసీలు రాజకీయంగా ఎదగడం ఏ పార్టీకి ఇష్టం లేదని 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు అన్నారు. పలు కులసంఘాల ప్రతినిధులతో పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంగళవారం బీసీ ఆక్రోశ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. సభ విజయవంతం కోసం ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఛైర్మన్‌గా మార్కంటి భూమన్న, వైస్ ఛైర్మన్లుగా క్యాతం సిద్దిరాములు, విఠల్ ముదిరాజ్, బాలార్జున్ గౌడ్‌లు ఎన్నిక కాగా.. 30 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం బీసీ ఆక్రోశ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం బీసీ ఇంటలెక్చువల్ ఫోరం, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, బీసీ పొలిటికల్ ఫ్రంట్, జస్టిస్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో రిజర్వేషన్ సాధన సమితి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్టోబర్ 24న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ బయట కామారెడ్డిలో మొట్టమొదటి బీసీ ఆక్రోశ సభ ఈనెల 15న పట్టణంలోని సత్య కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్ అడ్డుకునేదెవరు..? బీసీలకు



శత్రువులెవరు? అనేది తెలుసుకోవడానికి ప్రజలు ఈ సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.






## రోడ్డెక్కిన పెద్దకొడప్‌గల్ గ్రామస్థులు

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** విద్యుత్ వైర్లు తెగిపడి ఇళ్లపై పడగా ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ఘటన పెద్దకొడప్‌గల్‌లో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కేంద్రంలోని కొత్త ప్లాట్ల ఏరియాలో మంగళవారం ఉదయం 11 కేవీ వైర్లు ఒక్కసారిగా తెగి ఇళ్లపై పడ్డాయి. అయితే ఆ సమయంలో జనాలు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. 11కేవీ వైర్లతో ప్రమాదం పొంచి ఉందని తమ ఇళ్లపై నుంచి ఈ విద్యుత్ తీగలను తొలగించాలని పేర్కొంటూ కాలనీవాసులు గతంలోనూ విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించారు. అయినప్పటికీ వారు పెడచెవిన పెట్టారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ధర్నాకు దిగారు. విద్యుత్ వైర్లు తెగిపడిన సమయంలో ఎవరూ లేకపోవడం మంచిదైందని.. లేకపోతే ప్రాణాలు పోయేవని వారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే తీగలను ఇళ్లపై నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై అరుణ్‌కుమార్ కాలనీవాసులు ధర్నా చేస్తున్న గాంధీ చౌక్‌కు చేరుకున్నారు. సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ధర్నా విరమించారు.

## అందెశ్రీ అంత్యక్రియల్లో పాల్గొన్న యెండల



**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ రాష్ట్ర గీత రచయిత కవి అందెశ్రీ పార్థీవదేహానికి మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ నివాళులు అర్పించారు. అందెశ్రీ అంత్యక్రియల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యెండల మాట్లాడుతూ తూటాల వంటి మాటలు, పాటలతో తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేయడంలో అందెశ్రీ కీలకపాత్ర పోషించారన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, తిరిగి ఉప ఎన్నికల్లో పోటీచేస్తే తన గెలుపు కోసం అందెశ్రీ వెన్నంటే ఉన్నారని గుర్తు చేశారు.

## మధుమేహం పట్ల జాగ్రత్తగా ఉండాలి



**అక్షరటుడే, ఇందూరు:** మధుమేహం పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. నగరంలోని కోట గల్లి మైసమ్మ ఆలయం చౌరస్తా వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ నేత ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. పలువురికి ఉచితంగా షుగర్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు అంకం లక్ష్మణ్, ధర్మరాజు, గంగరాజు, దేవిదాస్, లింగం, చింతల గంగాదాస్ పాల్గొన్నారు.




ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. రేషన్ దుకాణాల వద్దే పలువురు దళారులు బియ్యం కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. అనంతరం దానిని బ్లాక్ మార్కెట్‌కు తరలించి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. కొంతమంది రైస్‌మిల్లులకు తరలించి ఆ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేస్తున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి

# రేషన్ బియ్యం దందా..

- సన్న బియ్యం ఇస్తున్నా.. అమ్ముకుంటున్న పలువురు
- ప్రజల నుంచి మిల్లులకు చేరుతున్న వైనం
- రీసైక్లింగ్ చేస్తూ ప్రభుత్వానికి సరఫరా చేస్తున్న మిల్లర్లు
- పట్టించుకోని అధికారులు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. గతంలో దొడ్డు బియ్యం ఇచ్చిన సమయంలో చాలా మంది రేషన్ బియ్యం తినేవారు కాదు. ప్రస్తుతం సన్న బియ్యం ఇస్తుండడంతో చాలా మంది తింటున్నారు. అయితే కొందరు మాత్రం రేషన్ బియ్యం తినడం లేదు. వారి వద్ద దళారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రజల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని తీసుకుని ఎక్కువ ధరకు తిరిగి విక్రయిస్తున్నారు. కొందరు దళారులు రేషన్ దుకాణాల వద్దనే నిలబడి బియ్యం తీసుకున్న వెంటనే కాంటా చేసి అక్కడే డబ్బులు ఇస్తున్నారు. కిలో బియ్యానికి రూ.20, రూ.18 చొప్పున చెల్లిస్తున్నారు. అదే బియ్యాన్ని రైస్ మిల్లర్లకు రూ.30 నుంచి రూ.40 వరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది.

### రీసైక్లింగ్ చేసి..

కామారెడ్డి జిల్లాలో 578 రేషన్ దుకాణాలు ఉన్నాయి. మొత్తం 2,90,736 రేషన్ కార్డులు ఉండగా.. ప్రతినెల 6266.77 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. అయితే రైస్ మిల్లు నుంచి ప్రభుత్వానికి, అక్కడి నుంచి రేషన్ షాపులకు సరఫరా అవుతున్న బియ్యం.. మళ్లీ దళారుల ద్వారా తిరిగి రైస్ మిల్లుకే చేరుతున్నాయి. అక్కడినుంచి అదే బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి తిరిగి గోదాములకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందా ద్వారా ప్రతి నెల రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నట్టుగా తెలుస్తోంది.

### నీరు గారుతున్న ప్రభుత్వ ఆశయం

పేదలకు కడుపు నిండా అన్నం పెట్టేందుకు ప్రభుత్వం రేషన్ బియ్యం సరఫరా చేస్తోంది. గతంలో రూ.5కు కిలో చొప్పున రేషన్ బియ్యం ఇచ్చేవారు. అనంతరం రూ.రెండుకు కిలో చేశారు. తర్వాత ఉచితంగా పంపిణీ చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నారు. సన్న బియ్యం పంపిణీతో రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా కట్టడి చేయవచ్చని ప్రభుత్వం భావించింది. ప్రజలే కడుపునిండా అన్నం తింటారని ప్రభుత్వం ఆశించింది. అయితే సన్న బియ్యం కూడా పక్కదారి పడుతుండడంతో ప్రభుత్వ ఆశయం నీరు గారుతోంది.

### పట్టించుకోని అధికారులు

జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బియ్యం పక్కదారి పట్టకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అటువైపుగా కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు అరకొరగా దాడులు చేసి నామమాత్రంగా కేసులు నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### పక్కదారి పడితే చర్యలు

రేషన్ బియ్యం పక్కదారి పడితే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలు చోట్ల దాడులు చేసి బియ్యాన్ని పట్టుకున్నాం. ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలు, డీటీలు ఉన్నారు. రేషన్ షాపుల వద్ద బియ్యం కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం లేదు.

– వెంకటేశ్వర్ రావు, డీసీఎస్‌వో, కామారెడ్డి

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** వెల్మల్‌తో పాటు మామిడిపల్లి గ్రామాల్లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం బీజేపీ నాయకులు అందజేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు వారు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముప్కాల్‌లో శాఖాహారంపై అవగాహన ర్యాలీ



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండల కేంద్రంలో శాఖాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీఎస్ఎస్ఎం (పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్) నవనాథపురం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ర్యాలీ చేపట్టారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు జనాభాయ్ ర్యాలీని ప్రారంభించి ప్రజల్లో శాఖాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్థులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



## హనుమాన్ ఆలయ అభివృద్ధికి దాతల విరాళం

**అక్షరటుడే, బీర్కూర్:** మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయ అభివృద్ధి నిమిత్తం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్, ద్రోణవల్లి కృష్ణారావు విరాళం అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు ఇద్దరు వేర్వేరుగా రూ. 50వేల చొప్పున రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ సాయినాథ్ గుప్తా, ఎం.కుమార్ గుప్తా, యాట వీరేశం, గోసం బాబూలాల్, మాజీ ఎంపీపీలు విజయ్ ప్రకాశ్, తిలకేశ్వరి రఘు, సొసైటీ ఛైర్మన్ ఇంగు రాములు, అవారి గంగారాం, పరమేష్ పంతులు, కొట్టూరి ప్రవీణ్ గుప్తా, సాలె కిరణ్, లాడేగాం గంగాధర్, ఆనంద్, కర్ణకంటి రమేష్ గుప్తా, ఎనుగుపట్ల సాయిలు, మద్నూర్ నర్సింలు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణంలోని పోచమ్మ గల్లీలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్మూర్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాపంథా జిల్లా నాయకులు ముత్తన్న, ఆర్మూర్ సంయుక్త మండలాల కార్యదర్శి కిషన్, ఏఐయూకేఎస్ ఆర్మూర్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజన్న, ఏరియా అధ్యక్షుడు జక్కం శేఖర్, ఏరియా నాయకులు పోచన్న టీయూసీఐ నాయకులు నిమ్మల నిఖిల్, రవి, గీత, శ్యామల, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో మృతి చెందిన వృద్ధురాలు.. బంగారం గొలుసు చోరీ!

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆస్పత్రిలో వైద్యం కోసం వెళ్లిన వృద్ధురాలు మృతిచెందగా.. ఆమెపై ఉన్న బంగారు గొలుసు చోరీకి గురైనట్లు తెలుస్తోంది. ఈ ఘటన నగరంలోని హైదరాబాద్ రోడ్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని హైదరాబాద్ రోడ్డులోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రిలో ఓ వృద్ధురాలు గుండె సంబంధిత వ్యాధితో చేరింది. అయితే ఆదివారం తెల్లవారుజామున ఆస్పత్రిలో చేరగా.. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో మృతి చెందింది. అయితే ఆమె మెడలో ఉన్న 18 గ్రాముల బంగారం గొలుసు చోరీకి గురైనట్లుగా బాధితులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి సిబ్బందే గొలుసు చోరీ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో డయల్ 100కు కాల్.. ఒకరోజు జైలుశిక్ష

**అక్షరటుడే, కామారెడ్డి:** మద్యం మత్తులో పదేపదే 100 నంబరుకు కాల్ చేసిన వ్యక్తికి కోర్టు ఒకరోజు జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. కామారెడ్డి పట్టణ సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణానికి చెందిన షేక్ అమీర్ మద్యం మత్తులో అనవసరంగా సోమవారం డయల్ 100కు పదేపదే కాల్ చేశాడు. ఐదు సార్లు కాల్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో పోలీసులు అతడిని పట్టుకుని మంగళవారం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ చంద్రశేఖర్ ముందు హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ అతనికి రూ.వెయ్యి జరిమానాతో పాటు ఒక రోజు జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా సీఐ నరహరి మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో మాత్రమే డయల్ 100ను ఉపయోగించాలన్నారు. అనవసరంగా కాల్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేయకూడదని కోరారు.

## వర్సిటీలో అక్రమ నియామకాలపై చర్యలు తీసుకోవాలి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తెలంగాణ విశ్వవిద్యాలయంలో 2012లో జరిగిన అక్రమ నియామకాలను రద్దు చేస్తూ ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, ఏఐఎఫ్‌డీఎస్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వర్సిటీ విశ్వవిద్యాలయం ఉపకులపతి యాదగిరిరావుకు హైకోర్టు తీర్పు కాపీని అందజేస్తూ ఉత్తర్వులను అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజు గౌడ్, ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు రాజశేఖర్ మాట్లాడుతూ.. 2012లో వర్సిటీలో జరిగిన నియామకాల్లో అవకతవకలు జరిగాయని రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిందన్నారు. నాటి వీసీ, రిజిస్ట్రార్లు అక్రమాలకు పాల్పడ్డారని అప్పటినుంచి ఇప్పటివరకు సాగిన విచారణలో కోర్టు తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.



అయినప్పటికీ వర్సిటీ అధికారులు నిర్లక్ష్యం వహించడం చూస్తుంటే అక్రమాలకు కొమ్ము కాసినట్లే అవుతుందన్నారు. ఈ విషయంలో జిల్లాకు చెందిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర దర్యాప్తు కోసం సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కోరారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని, దుర్వినియోగమైన రూ. కోట్ల నిధులను రాబట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బైరాపూర్ రవీందర్, జవారి రాహుల్, సుధాకర్, భిక్షపతి పాల్గొన్నారు.



నిజామాబాద్ నగరంలోని కలెక్టరేట్‌లో..




ఎల్లారెడ్డి పట్టణంలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో..

## ఘనంగా అబుల్‌కలాం జయంతి

దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీతో కలిసి నడిచారని వారు పేర్కొన్నారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



తెలంగాణ విశ్వవిద్యాలయంలో..



ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..